పదవి కాంక్షతోనే ఆరోపణలు

- మున్సిపల్ చట్టప్రకారమే పర్యటనకు వెళ్లా
- పార్టీ కోసం నిజాయితీగా పని చేశా • మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్, ఆగస్టు 27 : పదవి కాంక్షతో తనపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని, తాను మున్సిపల్ చట్ట పరిధిలోనే అమెరికా పర్యటనకు వెళ్లానని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం వాట్సాప్‌లో ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యక్తిగత పర్యటనలో భాగంగా రెండు వారాల పాటు (14 రోజులు) అమెరికాకు వెళ్తున్నానని సాలకవర్గ సభ్యులకు, నగరపాలక సంస్థ కమిషనర్‌కు సమాచారం ఇచ్చానని గుర్తు చేశారు. తన పర్యటన పూర్తిగా మున్సిపల్ చట్టం ప్రకారంగానే రూపొందించుకున్నానని తెలిపారు. అయినప్పటికీ బీఆర్ఎస్‌లో బాధ్యత గల నగర శాఖ అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ, అతని సతీమణి డిప్యూటీ మేయర్‌గా జోడు పదవుల్లో ఉండి కూడా పదవి మీద వ్యామోహం, కాంక్షతో ఇన్‌చార్జి మేయర్ పదవి బాధ్యతలు ఇవ్వలేదని స్వార్థంతో బీసీ మహిళ అని బాధ్యతలు ఇవ్వలేదంటూ ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మేయర్‌గా నాలుగేళ్ల ఏడు నెలల కాలంలో పాలకవర్గ సభ్యులందరినీ కలుపుకొని ఏకతాటిపై ఉంచి అధికారులను సమన్వయం చేసుకొని ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో నగరాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలనే ఆకాంక్షతో ముందుండి పని చేశానన్నారు. మున్సిపల్ చట్టంలో అవకాశం లేకపోయినా చల్ల హరిశంకర్, ఆయన సతీమణి డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి తన మీద ఆరోపణలు చేయడం రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనన్నారు. 30 ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఏనాడూ పదవుల కోసం పరుగెత్తలేదని, ప్రజల మధ్య ఉండి పనిచేసిన వ్యక్తినని, తాము నమ్ముకున్న పార్టీకి నిజాయితీగా, న్యాయబద్ధంగా పని చేశామన్నారు. ఏ రోజు కూడా పార్టీలకు వెన్నుపోటు పొడిచే కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. ఏ ఎన్నికలు వచ్చినా పూర్తి స్థాయిలో అందులో లీనమై పని చేశానని, ఎమ్మెల్యే ఎన్నికలో గంగుల కమలాకర్ విజయానికి, ఎంపీ ఎన్నికల్లో వినోద్‌కుమార్ కోసం మనస్ఫూర్తిగా పని చేశామన్నారు. ఆ నమ్మకంతోనే పార్టీ రాష్ట్రంలో చాలా చోట్ల జరిగిన ఎన్నికల్లో తనకు బాధ్యతలు అప్పగించిందని తెలిపారు. అవినీతికి ఏ మాత్రం ఆస్కారం ఉండకూడదనే ధ్యేయంతో పనిచేసిన మనస్తత్వం తమదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన కొత్తలోనే ఎవరో కొంత మంది ఆరోపణలు చేస్తే అవినీతి జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్వయంగా తానే పత్రికా ముఖంగా ప్రకటించినట్లు గుర్తు చేశారు. పదవీ కాంక్షతో విమర్శలు చేసి పార్టీ పరువును ప్రజల్లో చులకన చేసినందుకు వీరిపై చర్యలు తీసుకోవాలని తాను పార్టీ అధిష్టానాన్ని, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌ను కోరుతున్నానని తెలిపారు. గత నాలుగున్నరేళ్లలో పార్టీ అప్పగించిన పనులు తప్ప ఏ ఒక్క రోజు కూడా కరీంనగర్‌ను విడిచి వెళ్లిన దాఖలాలు లేవన్నారు.

ఇంకెన్నాళ్లో అవమానాలు

- బీసీ మహిళ అంటే అంత చులకనా..?
- మేయర్‌పై డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణీహరిశంకర్ ఫైర్

కరీంనగర్ కార్పొరేషన్, ఆగస్టు 27: తాను ఒక బీసీ మహిళ కావడం వల్లే మేయర్ సునీల్‌రావు తనను చులకనగా చూస్తున్నారని, ఆయన వ్యవహారశైలితో నాలుగున్నరేండ్లుగా కుమిలిపోతున్నానని, ఇంకెన్నాళ్లీ అవమానాలని డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణీ హరిశంకర్ ఫైర్ అయ్యారు. కనీస సమాచారం లేకుండానే సునీల్‌రావు అమెరికా టూర్ వెళ్లారని, బీసీ మహిళ కావడం వల్లే తనకు ఇన్‌చార్జి మేయర్ బాధ్యతలు ఇవ్వలేదని విమర్శించారు. మంగళవారం స్థానిక 37వ డివిజన్ కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. మేయర్ సునీల్‌రావు ఈ నెల 23న అమెరికా టూర్ వెళ్లే విషయం డిప్యూటీ మేయర్ అయిన తనకు మాట వరుసకు కూడా చెప్పలేదని, అదే రోజు రాత్రి 8 గంటలకు మేయర్ పీఏ వాట్సాప్ గ్రూపులో పెట్టిన మెస్సేజ్ ద్వారా యూఎస్‌కు రెండు వారాల పాటు వెళ్లినట్లు తెలిసిందన్నారు. అయితే మేయర్ రెండు వారాలకు కాదు, 33 రోజుల షెడ్యూల్ పెట్టుకొని వెళ్లినట్లు ఫ్లయిట్ టికెట్స్ వాట్సాప్ గ్రూప్‌లో చక్కర్లు కొట్టాయన్నారు. మున్సిపల్ యాక్ట్ ప్రకారం 15 రోజులు కానీ, అంతకన్నా ఎక్కువ రోజులు గాని మేయర్ అందుబాటులో లేకుంటే డిప్యూటీ మేయర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వాల్సి ఉంటుందని, ఈ క్రమంలోనే తనకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు గుర్తు చేశారు. ఈ మేరకు కలెక్టర్ స్పందించి అమెరికాలో ఉన్న మేయర్‌కు నోటీసు పంపిస్తే, దీనికి జవాబుగా మేయర్ సునీల్‌రావు తాను నెల రోజుల టూర్ కోసం వెళ్లింది వాస్తవమేనని, కానీ సెప్టెంబర్ 6 వరకు ఇండియాకు వస్తున్నానని కలెక్టర్‌కు రిటర్న్ టికెట్లతో సమాచారం అందించారన్నారు. కలెక్టర్ నోటీసు ఇచ్చిన వెంటనే డిప్యూటీ మేయర్ తమ పార్టీయేనని, ఆవిడకు ఇన్‌చార్జి ఇవ్వమని చెప్పాల్సింది పోయి హుటాహుటిన టికెట్ రద్దు చేసుకొని రావడం చూస్తే

మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణీహరిశంకర్

నగరపాలక సంస్థలో నాలుగున్నరేండ్లలో ఎన్ని తప్పులు జరిగాయోనన్న అనుమానాలు కలుగుతున్నాయని వివరించారు. జూన్ 25న 33 రోజుల టూర్ కోసం టికెట్లు బుక్ చేసుకున్న మేయర్, రెండు నెలల తర్వాత అమెరికా వెళ్లారన్నారు. 14 రోజులు మాత్రమే అమెరికాకు వెళ్లే ఉద్దేశమే ఉంటే గత రెండు నెలలుగా టికెట్‌ను 14 రోజుల టూర్‌కు ఎందుకుమార్చుకోలేదని ప్రశ్నించారు. తాము కలెక్టర్‌ను కలిసి ఇన్‌చార్జీ బాధ్యతలు ఇవ్వాలని అడుగగానే హుటాహుటిన 33 రోజుల టికెట్ రద్దు చేసుకొని వస్తున్నాడంటే కేవలం బీసీ మహిళ అయిన తనకు ఇన్‌చార్జి మేయర్ బాధ్యతలు ఇవ్వడం ఇష్టం లేకనేనని అర్థమవుతున్నదన్నారు. ఇది ఒక మహిళకు జరిగిన అవమానమేనన్నారు. నాలుగున్నరేళ్లుగా డిప్యూటీ మేయర్‌గా తనను ఎలాంటి కార్యక్రమాలకు కూడా పిలిచింది లేదని, గౌరవం కూడా ఇవ్వలేదన్నారు. అయినా పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు మౌనంగా ఉంటూ వచ్చామన్నారు. అంతర్గతంగా ఎన్ని అవమానాలు జరిగినా ఓపికగా ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మేయర్ వ్యవహార శైలిని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లామని, తమకు ఇంతలా అవమాన పర్చిన మేయర్‌పై పార్టీ అధిష్టానం చర్యలు తీసుకోవాలని కోరారు. సునీల్‌రావు తెలంగాణ కోసం పోరాడారనో, ఇంకా ఏదో చేశారనో..? బీఆర్ఎస్ అధిష్టానం ఆయనకు మేయర్ పదవి కట్టబెట్టలేదని, అది మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌కే పెట్టిన భిక్ష అన్నారు. మేయర్ పదవి ఇచ్చిన వినోద్‌కుమార్‌కే గత ఎన్నికల్లో సున్నం పెట్టిన ఘనత సునీల్‌రావుదేనని ఆరోపించారు. నగరానికి స్మార్ట్‌సిటీ తీసుకువచ్చిన వినోద్‌కుమార్‌ను కాదని ఇప్పుడు రాజకీయ స్వార్థం కోసమే బండి సంజయ్ పేరు వాడుకుంటున్నాడని ఆరోపించారు.

టూర్ రద్దు వెనుక ఆంతర్యమేమిటో చెప్పాలి

కలెక్టర్ నోటీసు పంపిన వెంటనే 33 రోజుల అమెరికా టూర్‌ను రద్దు చేసుకొని 14 రోజులకు తిరిగివస్తామని చెప్పడంలో ఆంతర్యమేమిటో చెప్పాలని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ప్రశ్నించారు. ఇన్‌చార్జి బాధ్యతలు బీసీ మహిళకు ఇచ్చే అర్హత కూడా లేదా? అని ప్రశ్నించారు. అసలే వర్షాకాలం ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉందని, మేయర్ టూర్ వెళితే ప్రజలు ఇబ్బందులు పడాలా..? అని ప్రశ్నించారు. డిప్యూటీ మేయర్ పదవి తమకు సునీల్‌రావు పెట్టిన భిక్ష కాదని, పార్టీ అధిష్ఠానం ఇచ్చిన అవకాశంతో కార్పొరేటర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని గుర్తు చేశారు. రేపటి నుంచి మున్సిపాలిటీలో ప్రతి సెక్షన్ వారీగా సమాచారం తీసుకొని తప్పులు జరిగితే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్పొరేటర్లను గ్రూపులుగా విభజించిన ఘనత సునీల్‌రావుదని విమర్శించారు. తమకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వకున్నా డిప్యూటీ మేయర్‌గా సమస్యల పరిష్కారానికి బాధ్యత తీసుకుంటామన్నారు. మేయర్ అమెరికా పర్యటనపై పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లిన తర్వాతే కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. బీసీ ఆడబిడ్డకు జరిగిన అవమానంపై బీసీలు, పార్టీ నాయకులు, శ్రేణులు, కరీంనగర్ ప్రజలు ఆలోచించాలన్నారు.

రామ సముద్రాన్ని వ్యర్థాల నుంచి కాపాడాలని వినతి

శంకరపట్నం, ఆగస్టు 27: రామ సముద్రం చెరువును జంతు కళేబరాలు, వ్యర్థాల నుంచి కాపాడాలని ముత్తారం గ్రామ ప్రజలు కలెక్టర్‌కు విన్నవించారు. ముత్తారం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పలువురు గ్రామస్తులు మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలోని వాగుపై వంతెన వద్ద నిత్యం మాంసం, చేపల విక్రయాలు జరుగుతుంటాయని, నిర్వాహకులు ఆయా జంతు, చేపల వ్యర్థాలు, మృతి చెందిన జంతు, పశువుల కళేబరాలను సైతం వాగులో పడేయడం, అలాగే కేశవపట్నం గ్రామానికి చెందిన డ్రైనేజీ మురుగు నీరు, దుకాణాల్లో పోగైన చెత్తా చెదారం, తదితర వ్యర్థాలను కూడా ఇదే వాగులో పడవేయడం వల్ల చెరువు నీరు గరళంగా మారుతున్నదని వాపోయారు. మనుషులతో పాటు జంతువులకు సైతం ముప్పు పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని తెలిపారు. కలెక్టర్ సమస్య తీవ్రతను గుర్తించి వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఏడీఏను సన్మానించిన ఫర్టిలైజర్స్ డీలర్స్ అసోసియేషన్ సభ్యులు

ఏడీఏ శ్రీధర్‌ను సన్మానిస్తున్న ఫర్టిలైజర్స్ డీలర్స్ అసోసియేషన్ సభ్యులు

తిమ్మాపూర్ రూరల్, ఆగస్టు 27 : మానకొండూర్ ఏడీఏగా బదిలీపై వచ్చిన శ్రీధర్‌ను తిమ్మాపూర్ రైతు వేదికలోని తన కార్యాలయంలో మంగళవారం గన్నేరువరం ఫర్టిలైజర్స్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అటికం తిరుపతి, సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. బొకే ఇచ్చి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గన్నేరువరం మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి, ఫర్టిలైజర్స్ డీలర్స్ అసోసియేషన్ సభ్యులు రాములు, శ్రీధర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో అక్షర విద్యార్థుల ప్రతిభ

కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ఎస్సై సురేందర్

రామడుగు, ఆగస్టు 27 : గోపాల్‌రావుపేట అక్షర స్కూల్ విద్యార్థులు ఈ నెల 25న జిల్లా కేంద్రంలోని రెవెన్యూ గార్డెన్‌లో ఇంటర్నేషనల్ షావోలిన్ కుంగ్‌ఫూ ఆధ్వర్యంలో జరిగిన రెండో రాష్ట్ర స్థాయి ఓపెన్ కుంగ్‌ఫూ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ చూపారు. కటా విభాగంలో 9 మంది విద్యార్థులు బంగారు పతకాలు, ముగ్గురు రజత పతకాలు, ఆరుగురు కాంస్య పతకాలను గెలుపొందారు. అత్యధిక పతకాలతో ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించారు. కరాటేలో ప్రతిభను చూపిన విద్యార్థులకు ఎస్సై మామిడాల సురేందర్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, కరాటే నేర్చుకోవడంవల్ల ఆత్మవిశ్వాసం, మనోధైర్యం పెరుగుతుందన్నారు. ఇక్కడ కరాటే మాస్టర్ సుంకె రాజు, విద్యార్థులు ఉన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

తిమ్మాపూర్: నుస్తులాపూర్ అంగన్‌వాడీలో కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

తిమ్మాపూర్/రామడుగు/ శంకరపట్నం/చొప్పదండి/కొత్తపల్లి, ఆగస్టు 27: జిల్లా వ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలు మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణల్లో ముచ్చటగొలిపేలా ముస్తాబయ్యారు. కొద్దిసేపు ఉట్టికొట్టే వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో అంగన్‌వాడీ టీచర్ రజిత, తల్లులు పాల్గొన్నారు. రామడుగు మండలం గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ విద్యాలయంలో జరిగిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వీ నరేందర్‌రెడ్డి హాజరయ్యారు. విద్యార్థులతో కలిసి ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. శంకరపట్నం మండలం కేశవపట్నం శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో ఉట్టి కొట్టే వేడుకలు ఘనంగా నిర్వహించారు. చొప్పదండి మండలం భూపాలపట్నం గ్రామంలోని సెయింట్ మదర్ థెరిసా పాఠశాలలో కృష్ణాష్టమి, మదర్ థెరిసా జయంతి వేడుకలను పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ నాగోతు వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వాణీనికేతన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో పాఠశాల డైరెక్టర్ రేణుక, ప్రిన్సిపాల్ కోట లక్ష్మారెడ్డి, కిడ్స్‌కేర్ ఇన్‌చార్జులు సందీప్ జేసన్, సుమశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్ గ్రామంలోని వేణుగోపాల స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. కరీంనగర్ పీఏసీఎస్ చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి పాల్గొన్నారు.

ఆటో యూనియన్ నూతన కార్యవర్గం

తిమ్మాపూర్ రూరల్, ఆగస్టు 27: ఆటో యూనియన్ మండల నూతన కార్యవర్గాన్ని జిల్లా అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడు మద్దల రాజేందర్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జినుక శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా సంపత్, ప్రధాన కార్యదర్శిగా భూమేశ్, సహాయ కార్యదర్శులుగా రాజేశ్, శ్రీనివాస్, కోశాధికారిగా మామిడి రాజయ్య, ఆర్గనైజర్‌గా పాశం ఎల్లయ్య ఎన్నికయ్యారు. అనంతరం మండల జేఏసీ కమిటీ సభ్యులుగా తొట్ల సమ్మయ్య, ఎడల రాజమౌళి, గుర్రం సత్యనారాయణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు అనంతగిరి సంపత్, రాంగోపాల్ రెడ్డి, ఆంజనేయులు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి మూడేండ్ల జైలు

కోర్టుచౌరస్తా/ గంగాధర, ఆగస్టు 27: ఇంటి పక్క వారితో చిన్న తగాదాలు మనసులో పెట్టుకొని ఇనుపరాడు, కత్తితో దాడికి దిగి హత్యాయత్నం చేసిన నేరంలో నిందితుడు అంకమల్ల కనకయ్య (45)కు మూడు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.2500 జరిమానా విధిస్తూ కరీంనగర్ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి శ్రీలేఖ మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్, గంగాధర ఎస్ఐ కిరణ్‌రెడ్డి కథనం ప్రకారం.. గంగాధర మండలం వెంకటాయపల్లికి చెందిన నల్లాల పోచయ్య, అదే గ్రామానికి చెందిన అంకమల్ల కనకయ్య కుటుంబాల మధ్య పెంటకుప్ప విషయంలో గొడవలు జరిగాయి. పోచయ్య కొడుకు అనిల్‌కు కనకయ్యకు మధ్య కూడా గొడవలు జరుగు తుండేవి. దీంతో కనకయ్య అనిల్‌పై కక్ష పెంచుకున్నాడు. 28 మే 2022న రాత్రి అనిల్, అతడి భార్య పుష్ప వారి ఇంటి డాబాపై పడుకొని ఉండగా మధ్య రాత్రి కనకయ్య ఇనుపరాడు, కత్తితో వెళ్లి వారిద్దరిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ ఘటనపై అనిల్ తండ్రి గంగాధర పోలీసులకు ఫిర్యాదు చేయగా కనకయ్యపై కేసు నమోదు కాగా, సీఐ రవీందర్ దర్యాప్తు జరిపారు. ఈ కేసులో సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గడ్డం లక్ష్మణ్ కోర్టులో ప్రవేశపెట్టి విచారించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన జడ్జి శ్రీలేఖ నిందితుడు కనకయ్యకు జైలు శిక్ష జరిమానా విధించారు.

పేద విద్యార్థికి చేయూత

విద్యానగర్, ఆగస్టు 27: కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులతో హాస్టల్ ఫీ కట్టలేని స్థితిలో ఉన్న పేద విద్యార్థికి ఆర్య వైశ్య సంఘం కరీంనగర్ పట్టణాధ్యక్షుడు నగనూరి రాజేందర్ చేయూతనందించారు. నగరంలోని కిసాన్ నగర్ ప్రాంతానికి చెందిన నార్ల అరుణ్ కుమార్ కొండగట్టులోని జేఎన్‌టీయూలో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. అతడి తండ్రి నార్ల మనోహర్ ఆటో డ్రైవర్ కావడంతో ఇల్లు గడవడమే కష్టంగా మారింది. ఈ క్రమంలో ఆయన నగనూరి రాజేందర్‌ను కలిసి తన కుమారుడి చదువుకు సహాయం చేయాలని కోరగా, మంగళవారం పట్టణ ఆర్య వైశ్య సంఘం కార్యాలయంలో విద్యార్థి అరుణ్‌కుమార్‌కు రూ.6500తో పాటు బ్యాగ్, నోట్ బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి సుద్దాల వెంకటేశ్, ఆర్య వైశ్య యువజన సంఘం పట్టణాధ్యక్షుడు తణుకు సాయికృష్ణ, పడమటింటి సంతోష్ కుమార్, తోడుపునూరి హరి ప్రసాద్, కొంజర్ల శ్రీకాంత్, విద్యార్థి తల్లితండ్రులు పాల్గొన్నారు.

నివాస గృహాల మీదుగా 11 కేవీ లైన్ వద్దు

శంకరపట్నం, ఆగస్టు 27: నివాస గృహాల మీదుగా 11 కేవీ లైన్ వేయవద్దని కన్నాపూర్ గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. అర్కండ్ల గ్రామ శివారులో ఓ వ్యక్తి రైస్‌మిల్లు నిర్మిస్తుండగా, ట్రాన్స్‌కో సిబ్బంది మంగళవారం కన్నాపూర్-అర్కండ్ల రోడ్డు పక్కన 11 కేవీ లైన్ నిర్మాణ పనులు మొదలు పెట్టడంతో ఆ కాలనీవాసులు నిరసన వ్యక్తం చేశారు. ఇండ్ల ముందు నుంచి 11 కేవీ లైన్ వెళ్లడం వల్ల ఇబ్బందులు తలెత్తుతాయని ఏఈ సంపత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొత్త లైన్ వేస్తామని ఏఈ మాట ఇవ్వడంతో వెనుదిరిగారు.

'ఎలాంటి ఆక్రమణలు జరుగలేదు'

వీణవంక, ఆగస్టు 27: డబ్బులు చెల్లించి స్థలాన్ని కొనుక్కొని తాము వ్యాపారాలు చేసుకుంటున్నామని, ఎలాంటి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకోలేదని చల్లూరు ప్రభుత్వ పాఠశాల సమీపంలోని షాపుల నిర్వాహకులు స్పష్టం చేశారు. చల్లూరు ప్రభుత్వ పాఠశాల ఆవరణలో అక్రమంగా స్థలాన్ని ఆక్రమించుకొని షాపులు ఏర్పాటు చేసుకున్నారని, ఇప్పలపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి ముదుగంటి రఘునాథరెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, షాపుల నిర్వాహకులు మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. 1990లో చల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యాకమిటీ చైర్మన్, సభ్యులు, హెచ్ఎం, సర్పంచ్ తీర్మానం మేరకు షాపులు నిర్మించుకోవడానికి ఒక్కొక్కరం రూ.25 వందలు చెల్లించినట్లు తెలిపారు. నాటి నుంచి ఇప్పటి వరకు ప్రతి సంవత్సరం గ్రామ పంచాయతీకి షాపులకు పన్ను చెల్లిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో షాపుల నిర్వాహకులు సముద్రాల బాపు, ఎస్డీ రఫియొద్దీన్, గడ్డం నారాయణ, లలితారెడ్డి, ఎల్కపల్లి నగేశ్, ముత్యాల సతీశ్, ముత్యాల కార్తీక్, తోట రవీందర్, ఎండీ మోసిన్, బోదాసు సది, ఫారూక్, మామిడి కనకమ్మ పాల్గొన్నారు.

వాగేశ్వరి అధ్యాపకుడికి డాక్టరేట్

తిమ్మాపూర్, ఆగస్టు 27: రామకృష్ణకాలనీలోని వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అధ్యాపకుడిగా పని చేస్తున్న కంకణాల శ్రీధర్‌రెడ్డికి ఉత్తరప్రదేశ్‌లోని గ్లోకల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. 'డిజైన్ అండ్ ఎవల్యూషన్ ఆఫ్ క్వశ్చన్ అండ్ ఆన్సరింగ్ టెక్నిక్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' అంశంపై ప్రొఫెసర్ డాక్టర్ అమిత్ సింగ్ల పర్యవేక్షణలో ఆయన పరిశోధన చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డిని కళాశాల సెక్రటరీ డాక్టర్ గండ్ర శ్రీనివాస్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ డీ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ వినోద్, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, హెచ్‌వోడీ చంద్రమౌళి, అధ్యాపకులు అభినందించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PLOT FOR SALE

★కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి, అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.

NT- 326217

CHANGE OF NAME

★I, ABDUL SHAMI, R/o. 3-65, Rudraram, Vemulavada, Rajanna Sircilla-505 402, in My Passport No. L4712785, My Father's Name is mentioned as MOHAMMED MAHABOOB ALI which is Changed to MAHABOOB ALI.

NT-334203

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571

9182 777 189

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం చేసుకోవద్దు: ఏసీపీ

జమ్మికుంట/హుజూరాబాద్ టౌన్, ఆగస్టు 27: డ్రగ్స్‌తో జీవితాలను నాశనం చేసుకోవద్దని హుజూరాబాద్ ఏసీపీ సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. జమ్మికుంట పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఏసీపీ మాట్లాడుతూ, విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరూ మంచి అలవాట్లను అలవర్చుకొని ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరుచుకుని ఉన్నత స్థానాలకెదగాలన్నారు. అలాగే హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ అవగాహన సదస్సులో ఏసీపీ మాట్లాడుతూ, వాహనదారులందరూ తప్పక ట్రాఫిక్ నిబంధనలు పాటించి,తమ జీవితాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో సీఐలు రవి, జి.తిరుమల్, ఎస్ఐలు వివేక్, షేక్ యూనస్, ప్రిన్సిపాల్‌లు రమేశ్‌బాబు, రవీందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వం

తెలంగాణచౌక్, ఆగస్టు27: కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించేలా ఒప్పందాలను కుదుర్చుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మండిపడ్డారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నగరంలోని పొన్నం కాంప్లెక్స్ గల డిప్యూటీ లేబర్ ఆఫీసర్ కార్యాలయం ఎదుట లేబర్ బిల్డింగ్, అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో (సీఐటీయూ అనుబంధం) మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ, అడ్వైజర్ కమిటీ ద్వారానే కార్మికులకు సంక్షేమ పథకాలను అందించాలన్నారు. అనంతరం లేబర్ కార్యాలయంలో సూపరింటెండెంట్ మనోజ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జగదీశ్, రాజేందర్, నారాయణ, చక్రపాణి, శంకర్ పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

తెలంగాణచౌక్, ఆగస్టు27: శాతవాహన విశ్వ విద్యాలయం మాజీ ఉపకులపతి మల్లేశంపై అసత్య ఆరోపణలుచేస్తున్న కాంట్